సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 19 । జనవరి । 2024



దాడి ఘటనలో తీవ్రగాయాలై..

దాడి ఘటనలో 20 రోజుల క్రితం తీవ్రగాయాల పాలైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు.

- 8లో ▸



మట్టి రోడ్లకు మోక్షమెప్పుడో?

రాజంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో బీటీ రోడ్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.5 /17.3

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

అరుణతారకే మరోసారి అవకాశం



సాక్షి, కామారెడ్డి : బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా అధిష్టానం మరోసారి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతారకే అవకాశం కల్పించింది. ఆమెను కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. కామారెడ్డి జిల్లా ఏర్పాటు తర్వాత మొదటి అధ్యక్షురాలిగా అరుణతార నియామకమైంది. అప్పటి నుంచి పార్టీ జిల్లా రథసారథిగా కొనసాగుతున్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్ : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ సత్యనాథ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25కు గాను 6, 7, 8వ తరగతుల్లో ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం బీసీ, ఎస్టీ, ఎస్సీ, ఈబీసీల్లో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, దరఖాస్తుకు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

రాజంపేట సొసైటీ చైర్మన్‌పై అనర్హత వేటు



రాజంపేట: రాజంపేట సొసైటీ చైర్మన్ నల్లవెల్లి అశోక్‌పై గురువారం జిల్లా సహకార శాఖ అనర్హత వేటు వేసింది. దీర్ఘకాలిక రుణ చెల్లింపుల జాప్యం విషయంలో సొసైటీ చైర్మన్ అశోక్‌కు జిల్లా సహకార శాఖ ఇటీవల నోటీసులు జారీ చేసింది. రుణ చెల్లింపు విషయంలో సరైన వివరణ రాకపోవడంతో సహకార శాఖ సెక్షన్ 21(ఎ)(1)(బి) ప్రకారం అశోక్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

బర్త్ సర్టిఫికెట్‌కు బదులుగా ఆధార్

ఆర్మూర్ : ఇకపై డేట్ ఆఫ్ బర్త్ (పుట్టిన తేదీ ధృవీకరణ) సర్టిఫికెట్‌కు బదులుగా ఆధార్ కార్డునే పరిగణలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ సంజీవ్ యాదవ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆధార్ కార్డు, ఈ–ఆధార్‌ను ఇకపై పుట్టిన తేదీ ధృవీకరణ పత్రంగా దేశ వ్యాప్తంగా గుర్తించబడుతుందని ఉత్తర్వుల్లో వివరంగా పేర్కొన్నారు.

22న పాఠశాలలకు సెలవు ప్రకటించాలి

బాన్సువాడ : అయోధ్యలో రామ మందిరంలో ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నందున జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భువనేకర్ సంతోష్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. సుమారు 500 ఏళ్ల నుంచి భారత ప్రజలు అయోధ్యలో రామాలయ పునర్నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న రోజని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఒక్కపూట సెలవు ప్రకటించిందన్నారు. ప్రతి గ్రామంలో సంబరాలు జరుపుకోనున్న నేపథ్యంలో రాష్ట్రంలో కూడా సెలవు ప్రకటించాలని కోరారు.

విత్తనక్షేత్రంలో వరిధాన్యం వేలం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద విత్తనోత్పత్తిక్షేత్రంలో విత్తనాలకు ఉపయోగపడని వరి ధాన్యాన్ని గురువారం వేలం వేశారు. జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి, టీఎస్ సీడ్ డెవలప్‌మెంట్ మేనేజర్ విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో వేలంపాట నిర్వహించారు. 30 క్వింటాళ్ల కేఎన్ఎం–118రకం, 90 క్వింటాళ్ల జేజీఎల్–24423రకం దొడ్డు రకం ధాన్యాన్ని వేలం వేశారు. వేలంపాటలో పలువురు రైస్‌మిల్లుల యజమానులు పాల్గొనగా నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెదకు చెందిన శ్రీనివాస్ క్వింటాల్‌కు రూ. 2,280 చొప్పున 120 క్వింటాళ్ల ధాన్యాన్ని దక్కించుకున్నారు. కార్యక్రమంలో విత్తనక్షేత్ర ఏడీఏ వీరాస్వామి, ఎల్లారెడ్డి ఏడీఏ రత్నం, నాగిరెడ్డిపేట ఏవో విజయ్‌శేఖర్, మాల్తుమ్మెద ఉద్యానక్షేత్ర అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.



కామారెడ్డి పట్టణంలో అసంపూర్తిగా మిగిలిన సమీకృత మార్కెట్ కాంప్లెక్స్

‘సమీకృతం’ పిల్లర్లకే పరిమితం!

- అసంపూర్తిగా మార్కెట్ల నిర్మాణ పనులు
- మూడు పట్టణాల్లోనూ అదే పరిస్థితి
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో రోడ్లపైనే అమ్మకాలు
- నిధుల సమస్యే అంటున్న అధికారులు
- కొత్త సర్కారు దృష్టి సారిస్తేనే పూర్తి

సాక్షి, కామారెడ్డి: సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు పిల్లర్లకే పరిమితమయ్యాయి. జిల్లాలోని మూడు పట్టణాల్లో చేపట్టిన సమీకృత శాఖాహార, మాంసాహార దుకాణాల సముదాయాలు అసంపూర్తిగా మిగిలాయి. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో లక్ష్యం నెరవేరడంలేదు. కామారెడ్డి పట్టణంతో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాల్లో మార్కెట్లు నిర్మించేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. కానీ నిధులు, బిల్లుల సమస్యలంటూ కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పట్టణాల్లో కూరగాయలు, మాంసాహారం ఒకే చోట అందుబాటులో ఉండే విధంగా అప్పటి ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చింది. అందుకు అనుగుణంగా నిధులు మంజూరు చేసింది. అయితే పనులు నెమ్మదిగా జరిగి, తర్వాత ఆగిపోవడంతో ముందుకు కదలడం లేదు. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపి సరిపడా నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.



కామారెడ్డిలో రోడ్డుపైనే కూరగాయల అమ్మకం

కామారెడ్డిలో..

కామారెడ్డి పట్టణంలోని గాంధీ గంజ్‌లో రూ. 7.20 కోట్ల వ్యయంతో మార్కెట్ పనులు మొదలుపెట్టారు. కానీ పిల్లర్ల వరకు నిర్మించి వదిలేశారు. అప్పటి అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్ కావడంతో అధికారులు ఒత్తిడి తేలేదు. అప్పటి ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. దీంతో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అక్కడికి సమీపంలో రైతుబజార్‌ను నిర్మించి ఏళ్లు గడుస్తోంది. కనీసం కూరగాయల మార్కెట్‌ను అక్కడ నిర్వహించడం లేదు. జిల్లా కేంద్రంలో డెయిలీ మార్కెట్ మొత్తం దళారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. రైతులకు స్థలం లేక రోడ్లపై కూరగాయలు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. దుకాణాల యజమానులు రైతులను అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్నారు. అలాగే కొత్త బస్టాండ్ సమీపంలోని సీఎస్ఐ గ్రౌండ్‌లోనూ రైతులు కూరగాయలు అమ్ముతున్నారు. ఈ రెండు చోట్ల మున్సిపాలిటీ నుంచి కనీస సౌకర్యాలు కల్పించకపోయినా రైతుల నుంచి తైబజార్ పేరుతో అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. ఎవరైనా గట్టిగా మాట్లాడితే దాడులకూ దిగుతున్నారు. దీంతో రైతులు తిట్టుకుంటూ అడిగినంత ఇస్తున్నారు.

బాన్సువాడలో..



బాన్సువాడ పట్టణంలోనూ మార్కెట్ పనులు మధ్యలో ఆగిపోయాయి. 2022 ఫిబ్రవరి 5న రూ. 2కోట్ల వ్యయంతో మార్కెట్ నిర్మాణ పనులకు అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పనులు మొదట్లో చురుకుగా సాగినా.. స్లాబ్ వరకు రాగానే నిలిచిపోయాయి. ప్రస్తుతం పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి. మాజీ స్పీకర్ పోచారం చొరవ తీసుకుని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి నిధులు తీసుకువచ్చారు. పనులు త్వరగా పూర్తిచేయాలని ప్రయత్నించారు. కానీ సదరు కాంట్రాక్టరు బిల్లుల సమస్యతో పనులు ఆపేసినట్లు తెలుస్తోంది.

ఎల్లారెడ్డిలో..



ఎల్లారెడ్డి పట్టణంలోనూ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పరిస్థితి అలాగే ఉంది. రూ. 2కోట్ల వ్యయంతో మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పిల్లర్లు, బీములు వేసి వదిలేశారు. పట్టణ నడిబొడ్డున నిర్మాణ పనులు చేపట్టినా, అది పూర్తి కాకపోవడంతో ప్రజలు నిరాశకు గురయ్యారు. పనులు తిరిగి ఎప్పుడు మొదలుపెట్టి ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అసలు సూత్రధారులెవరు..!

- లిక్విడ్ గంజాయి కేసు విచారణలో కనిపించని స్పష్టత
- లింకును పట్టుకోవడంలో వైఫల్యం
- ఏడుగురిలో ఇద్దరి రిమాండ్, ఐదుగురికి స్టేషన్ బెయిల్

సాక్షి, కామారెడ్డి: మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. రాష్ట్ర వ్యాప్తంగా మత్తు పదార్థాల అక్రమ దందాపై చర్యలు మొదలుపెట్టింది. కానీ కామారెడ్డి పట్టణ శివార్లలో ఇటీవల పోలీసులు ద్రవరూప గంజాయిని పట్టుకున్న కేసులో మాత్రం సరైన విచారణ జరగలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. పోలీసులు అక్కడ ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసి, ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. మిగతా ఐదుగురిని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. రిమాండ్‌కు పంపిన ఇద్దరు గంజాయి తీసుకువచ్చి అమ్ముతున్నారని చెబుతున్నారు. ద్రవరూపంలో చిన్న చిన్న బాటిళ్లలో ఉన్న గంజాయిని అరకు నుంచి తీసుకువచ్చారని, అందులో కొంత హైదరాబాద్‌లో విక్రయించారని, మిగతా 39 బాటిళ్లను సీజ్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.

దందా వెనకున్నదెవరు..!

అరకులో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చారని పోలీసులు దర్యాప్తు నివేదికలో వెల్లడించారు. అరకు నుంచి కారులో తీసుకువచ్చారని చెబుతున్న పోలీసులు.. ఎవరి ద్వారా కొనుగోలు చేశారు ? ఎవరెవరి ప్రమేయం ఉంది ? అన్న కోణంలో ఎందుకు దర్యాప్తు జరపడం లేదని అనుమానాలకు తావిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎలాంటి ఆధారాలు దొరకని ఎన్నో కేసులను ఛేదించిన పోలీసులు.. ఈ కేసులో నిందితుల సెల్‌ఫోన్ల నుంచి ఎవరెవరికి ఫోన్లు వెళ్లాయి ? వీరి ఫోన్లకు ఎవరి నుంచి ఫోన్లు వచ్చాయన్నదానిపై ఎందుకు కూపీ లాగలేదన్నది పోలీసులకే తెలియాలి.

రాజకీయ ఒత్తిళ్లే కారణమా..!

గంజాయి కేసులో పోలీసులపై ఉన్నత స్థాయి ఒత్తిళ్లు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. గంజాయి కేసులో చిక్కిన వారిలో ప్రముఖుల పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో రాజకీయ ఒత్తిళ్లు రావడంతో ఆదరాబాదరాగా అరెస్టు చూపారని అంటున్నారు. ప్రభుత్వం ఒక వైపు మత్తు పదార్థాల అక్రమ దందాను అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలని చెబుతుంటే ఇక్కడ మాత్రం గంజాయి కేసును నీరుగార్చే ప్రయత్నం జరిగిందన్న విమర్శలు వస్తున్నాయి. ద్రవరూప గంజాయి సరఫరా చేస్తున్న ముఠాకు సంబంధించిన లింకును గుర్తించాల్సిన అవసరం ఉంది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

తీగ లాగితే కదా.. లింకు దొరికేది..

ఎండు గంజాయిని పొట్లాల రూపంలో ప్యాక్ చేసి విక్రయించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కానీ ఈ సారి పోలీసులకు చిక్కిన గంజాయి ద్రవరూపంలో బాటిళ్లలో నింపి విక్రయిస్తున్నారు. దీన్ని సీరియస్‌గా పరిగణించాలి. ఎందుకంటే గతంలో ఎక్కడ కూడా ద్రవరూప గంజాయి పట్టుబడలేదు. ద్రవరూప గంజాయిని ఎలా తయారు చేస్తున్నారు.. చిన్నచిన్న బాటిళ్లలో నింపి ఎలా పంపుతున్నారనే అంశంలో మరింత లోతైన దర్యాప్తు జరిపితే లింకు దొరికేదని పలువురు పేర్కొంటున్నారు. ఏడుగురు చిక్కితే ఇద్దరినే రిమాండ్‌కు పంపించారు. మరింత లోతైన దర్యాప్తు చేస్తే లింకు చిక్కేదని భావిస్తున్నారు.

రూ. 50.62 కోట్ల రైతుబంధు జమ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): యాసంగికి సంబంధించి రైతుబంధు జిల్లాలోని 1,57,373 మంది రైతుల ఖాతాల్లో రూ. 50.62 కోట్లు జమ చేయబడ్డాయని జిల్లా వ్యవసాయాధికారిణి(డీఏవో) భాగ్యలక్ష్మి తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద విత్తనోత్పత్తిక్షేత్రంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ యేడు యాసంగిలో 3.90లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అంచనా వేశామన్నారు. ఇప్పటి వరకు 2 లక్షల ఎకరాలకుపైగా వివిధ పంటలను రైతులు సాగు చేశారన్నారు. వీటిలో 90వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారని, వచ్చేనెల మొదటివారం వరకు జిల్లాలో వరి లక్ష్యం పూర్తవుతుందని ఆమె పేర్కొన్నారు. చలితీవ్రత కారణంగా నారుమడిలో ఎదుగుదల లోపించిందని, దీంతోపాటు వర్షాలు లేకపోవడం వల్ల జిల్లాలో వరిసాగు వెనుకబడిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు లక్షా 55వేల ఎకరాల పంట నమోదు ప్రక్రియ పూర్తయిందన్నారు. జిల్లాలో 98,239మంది రైతులకు రూ.451కోట్లు రుణమాఫీ జరిగిందని ఆమె వివరించారు. ఆమె వెంట ఎల్లారెడ్డి డీఏ రత్నం, విత్తన క్షేత్ర ఏడీఏ వీరాస్వామి ఉన్నారు.

తిమ్మాపూర్ వేంకటేశ్వరాలయంలో శుద్ధి కార్యక్రమం

బాన్సువాడ : బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్ వేంకటేశ్వరాలయంలో గురువారం శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయాల శుద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయానికి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కమిటీని నియమించాలని కోరారు. కమిటీకి అభివృద్ధి, నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేళ్ల సాయి కిరణ్, హన్మాండ్లు, భూపాల్‌రెడ్డి, దొరబాబు, కోనాల గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ

నేడు కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీ, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని 25వ నంబర్ గదిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సొసైటీ జిల్లా చైర్మన్ ఎం రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగులు రక్తదానం చేస్తారని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఈ నెల 20, 21 తేదీల్లో స్పెషల్ డ్రైవ్
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 25న బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఓటర్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదుపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఫారం 6, 7, 8లతో ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. జూనియర్, డిగ్రీ కళాశాల్లో విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

ఓటు ప్రాముఖ్యతపై ఈ నెల 23న డివిజన్ స్థాయిలో, 24న జిల్లా స్థాయిలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించాలని సూచించారు. ఓటరు దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న జిల్లా కేంద్రంలో సీనియర్ ఓటర్లకు సత్కారం, కొత్తగా ఓటు హక్కు పొందిన యువఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, అభ్యంతరాలపై సూచనలు చేశారు. సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, డీపీవో శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్టేడియం ఆధునీకరణకు నిధులివ్వండి



కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

- కేంద్ర మంత్రులను కలిసిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం యువజన వ్యవహారాల, క్రీడా శాఖల మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియం ప్రహరీ, ట్రాక్ ఆధునీకరణ కోసం నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అన్ని మండలాల్లో మైదానాల నిర్మాణానికి సైతం నిధులివ్వాలని కోరారు. అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆమె కార్యాలయంలో కలిశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ సీఎం, ప్రస్తుత సీఎంలను కామారెడ్డిలో ఓడించినందుకు కేవీఆర్‌ను అభినందించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, జహీరాబాద్ పార్లమెంట్ ప్రభారి బద్దం మహిపాల్ రెడ్డి తదితరులున్నారు.

ఆర్థిక చేయూత అందించాలి



పాలీహౌస్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామ సంఘాల మహిళలకు ఆర్థిక చేయూత అందించాలనే ఉద్దేశంతో పాలీహౌస్‌లను ప్రోత్సహిస్తున్నట్లు డీఆర్‌డీవో సాయన్న సూచించారు. గురువారం భూంపల్లి శివారులో మొగ్గం రత్నమాల నిర్వహిస్తున్న పాలీహౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ సంఘాల మహిళలకు ఆదాయాన్ని సమకూర్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. పాలీహౌస్‌లో అధిక దిగుబడినిచ్చే కూరగాయల పంటలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజిరెడ్డి, సీసీలు గొర్రె రాములు, సీఏ శ్రీను, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాడు శ్రీరామ శిలల ఊరేగింపులో కరసేవకులు

కామారెడ్డి పట్టణంలో 1990లో నిర్వహించిన శ్రీరామ శిలల ఊరేగింపులో భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన కరసేవకులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన సందుగారి రవీందర్‌రెడ్డి, హరిస్మరణ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగార్తి బాల్‌రెడ్డి కామారెడ్డిలో నిర్వహించిన శ్రీరామ శిలల ఊరేగింపులో పాల్గొన్నారు. 1992లో అయోధ్యలో నిర్వహించిన కరసేవలో కూడా వీరు పాల్గొన్నారు. గురువారం వీరు 'సాక్షి'తో మాట్లాడుతూ రామజన్మ భూమి కోసం జరిగిన ప్రతి పోరాటంలో ఆందోళనలో చిన్నతనం నుంచి పాల్గొన్నామని చెప్పారు. అయోధ్యలో రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుండడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు.

\- భిక్కనూరు



కామారెడ్డిలో నిర్వహించిన శ్రీరామశిలల ఊరేగింపులో పాల్గొన్న రామేశ్వర్‌పల్లి కరసేవకులు(ఫైల్)

క్లుప్తంగా

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవు



భిక్కనూరు: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని ఏఎంవీఐ జయంతి శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం ఆయన భిక్కనూరు ఎస్సై సాయికుమార్‌తో కల్సి భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించాలన్నారు.

'అవసరాలను గుర్తించి ప్రణాళికలు తయారు చేయాలి'

- డీపీవో శ్రీనివాస్‌రావు



కామారెడ్డి అర్బన్: గ్రామ అవసరాలను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి గ్రామ ప్రణాళికపై పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ, ఆరోగ్య, విద్యుత్, పంచాయతీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామంలో శాఖల వారిగా అవసరాలను గుర్తించి రాయాలన్నారు. ప్రణాళిక సిద్ధం చేసిన తర్వాత గ్రామసభలో చదివి వినిపించి సలహాలు, సూచనలతో సమగ్రంగా తుది ప్రణాళికను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. డివిజనల్ పంచాయతీ అధికారి సాయిబాబా, మండల పంచాయతీ అధికారి మలహరి, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఆలయాల శుద్ధీకరణ



కామారెడ్డి టౌన్: బీజేపీ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ తీర్థ్' కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని అతి పురాతన కిష్టమ్మ, శివకేశవ ఆలయంలో శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఆలయంలోని చెత్తాచెదారం తొలగించారు. నీటితో ఆలయ ప్రాంగణం శుభ్రంగా కడిగారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అరుణతార మాట్లాడుతూ.. ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆలయాల్లో స్వచ్ఛతీర్థ్, శుద్ధీకరణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు శ్రీకాంత్, పండ్ల ప్రవీణ్, నరేందర్, నాయకులు తేలు శ్రీనివాస్, కుంట లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల తనిఖీ


బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలను జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం గురువారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేపట్టాలన్నారు. పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

ఏబీవీపీ యువజన వారోత్సవాలు ప్రారంభం



కామారెడ్డి టౌన్: ఏబీవీపీ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని శిశుమందిర్ మైదానంలో యువజన వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రముఖ్ గిరి మాట్లాడుతూ.. స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా యువజన వారోత్సవాలను ఈనెల 18, 19, 20 తేదీలలో క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్, విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ స్వామి, నగర అధ్యక్షుడు అనిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ అధ్యాపకుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ అధ్యాపకుల సంఘం క్యాలెండర్లను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాంలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీఎల్ఏ జిల్లా అధ్యక్షుడు నీలం నర్సింలు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి యాదన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు జయంత్, మల్లేశం పాల్గొన్నారు.

పురుగు మందు కొంటేనే యూరియా!

- అవసరం లేకున్నా రైతులకు అంటగడుతున్న డీలర్లు, సహకార సంఘాలు
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
- తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



ఆగ్రోస్ ఫర్టిలైజర్ దుకాణం

భీమ్‌గల్: మండలంలోని ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. యూరియా కావాలంటే గంట మందు, గడ్డి మందు, పురుగుల మందు, నానో యూరియా, కలుపు మందులు ఇలా తమ వద్దే తీసుకోవాల్సిందేనని లింకు పెడుతున్నారు. అవసరం లేకున్నా బలవంతంగా రైతులకు అంటగడుతున్నారు. పట్టించుకోవాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు సైతం అటు వైపు చూడకపోవడంతో వారి ఆగడాలకు అంతులేకుండా పోతోంది. దీంతో రైతులు అవసరం లేకపోయినా వాటిని కొనుగోలు చేస్తుండడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

డీలర్లకు అధికారుల అండ..

భీమ్‌గల్ మండలంలో అధికారుల అండతో డీలర్లు రైతులను మోసం చేస్తున్నారు. ఎవరైన రైతులు ఖచ్చితంగా యూరియా అడిగితే అందుబాటులో లేదు.. ఇక్కడ ఉన్న యూరియాకు వేరే రైతులు ముందే డబ్బులు చెల్లించారు, వారికే ఆ యూరియాను ఇస్తామని చెబుతున్నారు. కొందరు డీలర్లు అయితే ఏకంగా మేము చెప్పినవి కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తాం లేదంటే యూరియా ఒక్క బస్తా కూడా ఇవ్వం ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ దబాయిస్తున్నారు. ఆగ్రోస్, గ్రోమోర్, పలు ఫర్టిలైజర్ దుకాణాలతో పాటు రైతులకు అండగా ఉండాల్సిన సొసైటీల్లో కూడా రైతులకు బలవంతంగా లిక్విడ్ యూరియా, ఇతర మందులు అంటగడుతున్నారు. ఈ దందా బహిరంగంగానే కొనసాగుతున్నా.. మండల వ్యవసాయ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎరువుల వ్యాపారులు, సొసైటీలలో అధికారులు గడ్డి, కలుపు మందులు, నానో యూరియాను ఆఫర్లలో కొనుగోలు చేసి రైతులకు బలవంతంగా అంటగడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ స్వార్థం కోసం రైతులకు అవసరం లేని మందులను అంటగట్టి వాటిని వినియోగించేల చేస్తున్నారు. కొందరు రైతులు అవసరం లేకున్నా కొనడంతో వాటిని ఇంటి వద్దే ఉంచుతున్నారు. కొందరు కొనుగోలు చేశాం కదా అని అవసరం లేకున్నా పొలంలో పిచికారీ చేస్తున్నారు. దీంతో భూమి సారం కోల్పోవడమే కాకుండా, అదనపు భారం పడుతోంది.

నిర్లక్ష్యంగా వ్యవసాయ శాఖ

ఎరువుల డీలర్లు, సహకార సంఘాలు లింకు దందాలతో రైతులను మోసం చేస్తున్న వ్యవసాయ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాల్సిన వ్యవసాయశాఖ నామ మాత్రపు తనిఖీలతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికారులకు అందాల్సినవి అందుతుండడంతోనే వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

"యూరియా ఇవ్వమంటే ఇవ్వలేదు

నాకు రెండు ఎరువుల బస్తాలు ఇవ్వమని అడిగితే ఇవ్వలేదు. ఎందుకివ్వడం లేదని అడిగితే లిక్విడ్ యూరియా తీసుకుంటేనే యూరియా ఇస్తామన్నారు. అదనంగా డబ్బులు లేకపోవడంతో కొనుగోలు చేయలేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– రాజన్న, రైతు, బాబానగర్

కఠిన చర్యలు తప్పవు



రైతులకు అవసరమైన ఎరువులు, మందులే ఇవ్వాలి. వారితో బలవంతంగా వేరే మందులు కొనిపిస్తే చర్యలు తీసుకుంటాం. రైతులు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తే వ్యాపారులపై శాఖా పరమైన చర్యలు తీసుకొని లైసెన్సులను రద్దు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– సాయికృష్ణ, ఏవో, భీమ్‌గల్

అవినీతి @ వర్ని ఏఎంసీ

- రూ. 16 వేలు విలువ చేసే 30 మోటార్లు మాయం
- తనకేమీ తెలియదంటున్న కార్యదర్శి



వడపోత యంత్రాలు

వర్ని: జిల్లాలోని వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ అవినీతికి మారుపేరుగా మారింది. ఈ ఏఎంసీలో సుమారు రూ. 5 లక్షలు విలువ చేసే కుంభకోణం జరిగింది. పర్యవేక్షించాల్సిన కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వడ్లను జల్లెడ పట్టే చెన్నింగ్ మిషిన్లకు ఉండే 30 మోటార్లు మాయమయ్యాయి. రూ. 16 వేలు విలువ చేసే 30 మోటార్లు మిషిన్ల నుంచి గల్లంతయ్యాయి. 2020లో జిల్లా మార్కెట్ కార్యాలయం నుంచి 40 జల్లెడ పట్టే యంత్రాలు వర్ని మార్కెట్ కమిటీకి వచ్చాయి. అందులో యంత్రాల నుంచి 30 గల్లంతయ్యాయి. వీటితోపాటు యంత్రాలను కూడా అస్తవ్యస్తంగా పడేయంతో పనికిరాకుండా పోయాయి. మార్కెట్ కమిటీ ఆస్తులను కాపాడాల్సిన కార్యదర్శి తనకేమీ పట్టనట్టుగా వ్యవహరించడం శోచనీయం.

చెక్‌పోస్టుల్లోనే విధులు..

జల్లెడ యంత్రాల నుంచి మోటార్లు పోయిన విషయం వాస్తవమేనని ఎలా పోయాయో తనకు తెలియదని ఆ బాధ్యతను మరో కాంట్రాక్టు ఉద్యోగికి అప్ప జెప్పానని దాటవేయడం కొసమెరుపు. బాధ్యతగల కార్యదర్శి శ్రీనివాస్ ఆరు నెలల నుంచి తాను కార్యాలయానికి సరిగా రావడం లేదని మండల కేంద్రంలో ఉన్న చెక్ పోస్టులోనే విధులు నిర్వహిస్తున్నానని, కార్యాలయంలో ఏం జరుగుతుందో తనకు తెలియదని సమాధానం ఇవ్వడం బాధ్యతరాహిత్యానికి నిదర్శనం. సుమారు రూ. 5 లక్షల విలువ చేసే మోటర్లను కార్యదర్శి మరికొందరు కలిసి విక్రయించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల క్రితం మార్కెట్ కమిటీలో అగ్ని ప్రమాదం సంభవించి రూ. 16 లక్షల విలువగల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదం వెనుక భారీ కుంభకోణం ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. విలువైన వస్తువులను అమ్ముకొని అగ్ని ప్రమాదంలో దగ్ధమైనట్లు చూపించారన్న ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్ కమిటీలో జరుగుతున్న అవినీతిపై జిల్లా మార్కెటింగ్ అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

"ఎవరు ఎత్తుకెళ్లారో తెలియదు

మార్కెట్ కమిటీలో ఉన్న 30 వడపోత యంత్రాల మోటార్లు ఎలా మాయమయ్యాయో తెలీదు. నేను మార్కెట్ కమిటీ చెక్ పోస్టులోనే ఉంటున్నాను. కార్యాలయంలో ఏం జరుగుతుందో తెలీదు.

– శ్రీనివాస్, వర్ని మార్కెట్ కమిటీ కార్యదర్శి

ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటాం

వర్ని ఏఎంసీలో మోటార్లు మాయమైన విషయం తన దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.

– గంగు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

కార్యదర్శి నిలదీత

వర్ని: మార్కెట్ కమిటీలో వడబోత యంత్రాల మోటార్లు గల్లంతైన విషయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యదర్శి శ్రీనివాస్‌ను గురువారం నిలదీశారు.

కార్యాలయం నుంచి రూ. లక్షల విలువ చేసే మోటార్లు, ఇతర వస్తువులు కనబడకుండా పోతే ఏం చేస్తున్నారని నిలదీశారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు వీర్రాజు, నాయకులు శ్రీనివాస్, ప్రశాంత్, దామినేని నాగేశ్వరరావు, రామకృష్ణ ఉన్నారు.



కార్యదర్శిని నిలదీస్తున్న కాంగ్రెస్ నాయకులు

జరిమానాలు చెల్లించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు, ఓంపాల్

డిచ్‌పల్లి: మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల 13వ రౌండ్ సోషల్ ఆడిట్ (సామాజిక తనిఖీ)లో వెల్లడైన అక్రమాలకు సంబంధించి రికవరీ, ఫెనాల్టీ, ఎక్స్‌ప్లనేషన్స్‌ను ఈ నెలాఖరునాటికి అందజేయాలని ఈజీఎస్ అంబుడ్స్‌మెన్ శ్రీనివాసరావు, ఏపీడీ ఓంపాల్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సోషల్ ఆడిట్‌లో తేలిన ప్రకారం ఇన్‌చార్జి ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) బి.వినోద రూ.45,087, టీఏలు రాజేశ్వర్ రూ.55,880, వి.సంపూర్ణ రూ.9,152తో సహా మిగిలిన వారి వద్ద మొత్తం రూ.1,24,091 రికవరీ చేయాల్సి ఉందన్నారు. మరికొందరు జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రికవరీ, ఫెనాల్టీలతో పాటు ఉపాధి పనులకు సంబంధించి వివరణ (ఎక్స్‌ప్లనేషన్స్)ను ఈ నెలాఖరులోగా అందజేయాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీవో సుధాకర్‌రెడ్డి, టీఏలు కుందెన్ ఉమేష్, సాయికుమార్, వినోద, రాజేశ్వర్, కంప్యూటర్ ఆపరేటర్లు అన్నపూర్ణ, అనూష, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన జేఏసీ నేతలు



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో నిర్వహించిన విద్యుత్ సమీక్ష సమావేశానికి హాజరైన టీఎస్ఎన్‌పీడీసీఎల్ నూతన సీఎండీ వరుణ్‌రెడ్డిని జిల్లా విద్యుత్ జేఏసీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీఎండీని కలిసిన వారిలో జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కో కన్వీనర్ తోట రాజశేఖర్, 1104 కంపెనీ అధ్యక్షుడు రఘునందన్, శివాజీ గణేశ్, బాలేశ్ కుమార్, జి శ్రీనివాస్, ఎడ్ల నాగరాజు, గంగారాం నాయక్, ఎం అశోక్, రాజేందర్, ఆర్ చంద్రశేఖర్, రాజేందర్, జాకీర్ అలీ, నాగరాజ్, రమణ, హరికృష్ణ, శివ కుమార్, రవి కిశోర్, జ్ఞానేశ్, ప్రసాద్, నగేశ్, రాకేశ్ పాల్గొన్నారు.

21న ఖోఖో జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాస్థాయి సీనియర్ మహిళ, పురుషుల విభాగంలో ఖోఖో పోటీలను ఈ నెల 21న బోధన్‌లో ఉంటుందని జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జీవీ భూమారెడ్డి, ఎండీ అతీకుల్లా గురువారం తెలిపారు. ఈ పోటీలను కాకతీయ చేయూత చారిటబుల్ ట్రస్ట్ బోధన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8555996271, 7396541233, 9676269988 నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్

తల్లీకూతురు అదృశ్యం

బాల్కొండ: మెండోరా మండలం నెహ్రూనగర్ కాలనీకి చెందిన సంగెం రమాదేవి ఆమె కూతురు అక్షయ అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం కూతురుతో కలిసి ఇంటి నుంచి వెళ్లిన రమాదేవి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి నాలుగు రోజుల జైలు శిక్షను న్యాయమూర్తి సయ్యద్ ఖదీర్ విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ గురువారం తెలిపారు. కోర్టులో 10 కేసులకు సంబంధించి 8 గురికి రూ. 8600 జరిమానా విధించగా రెండు కేసులలో ఇద్దరికి నాలుగు రోజుల జైలు శిక్షను జడ్జి విధించారు. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన కోనె మహేందర్, పులాంగ్‌కు చెందిన షేక్ అన్వర్‌కు జైలు శిక్ష పడిందని చెప్పారు. వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మూడు టిప్పర్లు, జేసీబీ పట్టివేత

నిజామాబాద్ రూరల్: మండలంలోని గాంధీనగర్ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు టిప్పర్లు, జేసీబీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి నిర్వహించి పట్టుకున్నారు. ఈ వాహనాలను సీజ్ చేసి రూరల్ పీఎస్‌కు తరలించినట్లు రూరల్ ఇన్‌చార్జి ఎస్సై రామారావు తెలిపారు.

అన్నారంలో ఆటో బోల్తా..పలువురికి గాయాలు



రామారెడ్డి: మండలంలోని అన్నారం గ్రామ శివారులో గురువారం రాత్రి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఆటో అన్నారం నుంచి రెడ్డిపేటకు వెళ్తుండగా అన్నారం ఎల్లమ్మ ఆలయం ఎదుట అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురికి గాయాలు కాగా గ్రామస్తులు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అపరిచితులు కనిపిస్తే సమాచారమివ్వాలి



బాల్కొండ: గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి సూచించారు. మండల కేంద్రంలోని పీఎస్ ఎదుట గురువారం నిర్వహించిన 'నేను సైతం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యాపారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వ్యాపారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని, వాహన ధ్రువీకరణ పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు సహకరించాలని కోరారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

లింగంపేట: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పొల్కంపేట గ్రామంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు.. మెదక్ జిల్లా మక్త భూపతిపూర్‌కు చెందిన ఆకుల ప్రభాకర్(35) తొమ్మిది రోజుల క్రితం పొల్కంపేటలో తన సోదరి మాసుల సరిత ఇంటికి వచ్చాడు. ప్రభాకర్ తన స్వగ్రామంలో ఇల్లు కట్టుకున్నాడు. ఈ క్రమంలో అప్పులయ్యాయి. అప్పులు తీర్చడానికి కొంత కాలం క్రితం హైదరాబాద్‌కు వెళ్లిన ప్రభాకర్ అక్కడి నుంచి నేరుగా తన సోదరి ఇంటికి చేరుకున్నాడు. ఈ క్రమంలో చేసిన అప్పులు తీరడం లేదని మనస్తాపంతో సోదరి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య ఆకుల లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సాయిరెడ్డి

ఖలీల్‌వాడి: నవీపేట రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న రాయిచూర్ రైలులో నిద్రిస్తున్న ఓ మహిళా ప్రయాణికురాలి బ్యాగును చోరీ చేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైలులో నిద్రిస్తున్న మహిళ బ్యాగును నవీపేట్‌కు చెందిన షేక్ సలీం చోరీ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా షేక్ సలీంకు చెందిన ఫోన్ ఆధారంగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బ్యాగులో ఉన్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, గుర్తింపు కార్డులను రికవరీ చేసినట్లు చెప్పారు. సమావేశంలో సిబ్బంది మహబూబ్, రవి కిరణ్, రాములు, నాజ్మ, సలావుద్దీన్ ఉన్నారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో..

సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఈ నెల 17న రాత్రి 1.30 నిమిషాలకు ప్రయాణికుడి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించిన నిందితుడిని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిని జిల్లా కేంద్రానికి చెందిన పిల్లి శ్రీకాంత్‌గా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసులో కీలకంగా వ్యవహరించిన సిబ్బంది హన్మాండ్లు, రవికిరణ్, రాములు, సీనా, శరత్ బాబును అభినందించారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి



సాయిలు(ఫైల్)

నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్ కాలనీకి చెందిన డాంకె సాయిలు(58) గురువారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పొలంలో వరినాట్లు వేసిన కూలీలకు డబ్బులు చెల్లించేందుకు గురువారం ఇంటి నుంచి వెళ్లిన సాయిలు తిరిగి రాలేదని, తన స్నేహితుడు చాంద్‌పాషాతో కలిసి సంజీవ్ రెడ్డి కమర్షియల్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌కు వెళ్లినట్లు తెలిపారు. అక్కడ అపస్మారక స్థితిలో ఉన్న సాయిలుని బెల్ట్‌షాప్ నిర్వాహకుడు సంజీవ్‌రెడ్డే హత్య చేశాడని బాధిత కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. నవీపేటలోని రెండు వైన్స్‌లకు చెందిన యజమానులు బెల్ట్ షాప్ నిర్వాహకుడు సంజీవ్‌రెడ్డితో ములాఖతై అమాయకుల ప్రాణాల తో చెలగాటం ఆడుతున్నాడని మండిపడ్డారు. సంజీవ్‌రెడ్డితో పాటు అక్కడ పని చేసే అశోక్, నాగరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐ రమణ ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

దాడి ఘటనలో తీవ్రగాయాలై..

- చికిత్స పొందుతూ యువకుడి మృతి
- న్యాయం చేయాలని బంధువుల ఆందోళన



సూర్యకాంత్ (ఫైల్)



విచారణ చేస్తున్న ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: చిన్న విషయంలో మాటా మాటా పెరిగి జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు 20 రోజులుగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని డిగ్రీ కళాశాల ఎదుట వాగ్మారే సూర్యకాంత్ (25) ఓ ఫర్నిచర్ దుకాణం నడిపిస్తున్నాడు. గత నెల 29 అర్ధరాత్రి పట్టణానికి చెందిన కొందరు యువకులు దుకాణం సమీపంలో మూత్రవిసర్జన చేస్తుండగా సూర్యకాంత్, అతని తమ్ముడు శివ ప్రశ్నించారు. ఇది గొడవకు దారితీసింది. మాటా మాటా పెరిగి నరేందర్, రాకేశ్, ప్రణీత్, మనోజ్, మరో మైనర్ యువకుడు కలిసి అన్నదమ్ములపై దాడి చేశారు. దాడిలో సూర్యకాంత్ తీవ్రంగా గాయపడడంతో అదేరోజు ఏరియా ఆస్పత్రికి, ఆ తర్వాత హైదరాబాద్‌కు తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఇటీవల ఇంటికొచ్చి స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడు. గురువారం ఉదయం పరిస్థితి విషమించడంతో ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబీకులు దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. పట్టణ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. నిందితులు పరారీలో ఉన్నారని వారిపై సెక్షన్ 302 ప్రకారం హత్యకేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేదారేశ్వర ఆశ్రమాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



నందిపేట్: మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమాన్ని నిర్మల్ జిల్లా ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ గురువారం సందర్శించారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకుడు రాములు మహారాజుని సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పోచారం కాలువ డి-1 మూసివేత



నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం ప్రధానకాలువకు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ-1ను ఇరిగేషన్ సిబ్బంది గురువారం రాత్రి మూసేశారు. నిబంధనల ప్రకారం.. ఈ యేడు యాసంగి సీజన్‌లో ప్రాజెక్టు నీటిని ఆయకట్టు పరిదిలోని 'బీ'జోన్ భూములకు కేటాయించారు. ఈ నేపథ్యంలో 'ఏ'జోన్ పరిధిలోని ప్రధానకాలువ డిస్ట్రిబ్యూటరీలను ఇరిగేషన్ సిబ్బంది మొరంపోసి తాత్కాలికంగా మూసేశారు. కానీ గుర్తుతెలియని వ్యక్తులు గురువారం డిస్ట్రిబ్యూటరీ-1లో పోసిన మొరాన్ని తొలగించి అక్రమంగా తెరిచారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు రాత్రి అక్కడికి చేరుకొని సిబ్బందితో డిస్ట్రిబ్యూటరీని మూయించారు. మూసేసిన డిస్ట్రిబ్యూటరీలను ఎవరైనా అక్రమంగా తెరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

సొసైటీ సభ్యులకు శిక్షణ



సుభాష్‌నగర్: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సుపరిపాలన విధానంపై సొసైటీ చైర్మన్లు, పాలకవర్గసభ్యులకు గురువారం డీసీసీబీలో కో-ఆపరేటీవ్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ (సీటీఐ) ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీటీఐ ఫ్యాకల్టీ సభ్యులు విజయ్‌శంకర్, సుబ్బారావు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. రైతులకు అందించాల్సిన మరిన్ని సేవలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ నాగభూషణం, నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్, జీఎంలు యాదగిరి, సూర్యప్రకాశ్, సొసైటీ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త వంగడాలపై రైతులకు వివరించాలి

- కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



కామారెడ్డి క్రైం: రైతులు కొత్త వరి వంగడాలు సాగు చేసేలా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం క్యాలెండర్, డెయిరీలను గురువారం ఆవిష్కరించారు. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పశువుల పెంపకం, చేపల చెరువులు ఏర్పాటు చేసుకొని అదనంగా ఆదాయం పొందేలా చూడాలన్నారు. చిరుధాన్యాలు, కూరగాయల సాగు ఎక్కువగా చేపట్టేలా వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం జిల్లా చైర్మన్ భాగ్యలక్ష్మి, అధ్యక్షుడు నర్సింహులు, ఏడీఏలు రత్న, అపర్ణ, భారతి, ఏఓలు ప్రజాపతి, హరీశ్‌కుమార్, శ్రీకాంత్, విజయ శేఖర్, పవన్, రాధా, రమ్య పాల్గొన్నారు.